క్లుప్తంగా

బాబు ప్రభుత్వంపై దేవిశ్రీ పాటల విసుర్లు



ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ

సీతమ్మధార: 'బాబూ నీ బడ్జెట్ చేసినావులే కనికట్టు.. కొంటే రాదు పెసరట్టు.. వేస్తున్నా నీపై ఒట్టు..' అనే పల్లవితో సాగే పాటతో చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తూర్పారబట్టారు. ఆదివారం ఆయన జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 'సాక్షి'తో మాట్లాడుతూ తన పాటలోని పలు లైన్లను పాడి వినిపించారు. 'నీ పాలనలోన ఆంధ్ర దేశము అప్పుల పాలాయె.. అన్నపూర్ణ లాంటి రాష్ట్రము కరవుతో అల్లాడే.. కోతి గెంతితే సాయిబు డబ్బు తీసుకున్న చందంగా నీ పాలనలోన రక్షణ లేదు.. ఇది మా ఖర్మేనా' అంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని కడిగిపారేశారు. 'నీ పాలనలోన రైతన్నలకు గిట్టుబాటు ధర లేదు.. పరిపాలనలోన రైతన్నల నడ్డి విరిచినావు.. మింగ మెతుకు లేదంటే మీసాలకు సెంటెందుకు.. మాయ మాటలు,, దొంగ మాటలు ఎన్నో చెబుతావు' అంటూ చంద్రబాబు పాలన తీరును తనదైన శైలిలో ఏకిపారేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ బడ్జెట్లో లేకపోవడం, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, నిరుద్యోగులకు ఉపాధి, నిరుద్యోగ భృతిపై ప్రభుత్వ తీరును ఆక్షేపిస్తూ.. 'పొయ్యి మీదకు లేదంటే పొయ్యి కిందకి ఇస్తాడమ్మో.. ఆంధ్రప్రదేశ్‌ని నట్టేట ముంచిపోతున్నాడమ్మో' అంటూ తన పాటతో ప్రజల్ని చైతన్య పరుస్తానని పేర్కొన్నారు.

కానరాని సిగ్నల్ లైట్లు



ఇండస్ట్రియల్ ఎస్టేట్ కూడలిలో కానరాని ట్రాఫిక్ సిగ్నల్స్

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధి కంచరపాలెం ప్రధాన రహదారి నుంచి మర్రిపాలెం వెళ్లే మార్గంలో ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ జాడ కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ తుప్పు పట్టి మూలకు చేరడంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వాహన చోదకుడు, స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు పరీక్ష

సీతంపేట : ఎన్‌సీసీ కేడెట్ల 'ఎ' సర్టిఫికెట్ కోసం ఆదివారం శీలానగర్‌లోని ఎంపీఈవీఎం పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ సెకండియర్ ఎన్‌సీసీ విద్యార్థులు 26 మంది హాజరయ్యారు. 350 మార్కులకు జరిగిన పరీక్షల్లో ఆర్మీ డ్రిల్, వెపన్ ట్రెనింగ్, మ్యాప్ రీడింగ్, జనరల్ నాలెడ్జి, స్పెషలైజ్డ్ సబ్జెక్టుపై పరీక్ష నిర్వహించారు. పరీక్షలో కనీసం 175 మార్కులు సాధించాల్సి ఉంటుందని అక్కయ్యపాలెం 11 ఆంధ్రా ట్రూప్ కమాండర్ ఎం.ఎస్.వి. విశ్వనాథం తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు ఆర్మీలో చేరుటకు, వివిధ ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. కల్నల్ అజయ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షకు వివిధ ప్రాంతాల నుంచి 276 మంది హాజరయ్యారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న గొలగాని వీరారావు

సీతంపేట : హిందూ ముస్లిం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతంపేట రాజేంద్రనగర్‌లోని హిందూ ముస్లిం కాలనీలో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాలనీకి చెందిన బషీర్ బాబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ గొలగాని వీరారావు ప్రారంభించారు. ఆయన చేతుల మీదుగా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు దూరం.. పాతనగరం



జగదాంబ సెంటర్

- ఓ వైపు రెచ్చిపోతున్న కుర్రకారు
- మరో వైపు కేజీహెచ్‌లో నిత్యం ఏదో ఒక తంతు
- భయపెడుతున్న బైక్ రైడర్లు
- స్పష్టంగా కనిపిస్తోన్న నిఘా వైఫల్యం



పాతనగరం



కేజీహెచ్

కేజీహెచ్ విషయానికొస్తే..

విశాఖ కేజీహెచ్‌లో పూటకో వివాదం.. రోజుకొక విషాదం చోటు చేసుకుంటున్నాయి. నిఘా లోపం కేజీహెచ్‌ను వెంటాడుతుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.

దాబాగార్డెన్స్: ఒకప్పటి విశాఖ రాజధానిగా వెలుగొందిన పాతనగరంలో ఏం జరుగుతోంది? కుర్రకారు రెచ్చిపోతున్నారు. కేజీహెచ్‌లో గంజాయి బ్యాచ్ అలజడి చేస్తోంది. నకిలీ డాక్టర్ల బాగోతం భయపెడుతోంది. శిశువుల తారుమారు గందరగోళానికి గురి చేస్తోంది. ఇలా ఎన్నో సంఘటనలు అస్తవ్యస్త పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.

రాత్రి 11 గంటలు దాటితే..

రాత్రి 11 గంటలు దాటితే పాతనగరం ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బయటికి వస్తే తిరిగి ఇంటికి వెళ్తామో లేదో తెలియదు. పోలీసులు నిఘా అంటున్నారు. కానీ నిఘా కానరావడం లేదు. మిస్సింగ్ కేసులు.. గంజాయి బ్యాచ్ అలజడులు.. ఇలా ఎన్నో సంఘటనలు జరుగుతున్నా స్పందించాల్సిన పోలీసుల్లో స్పందన అంతంత మాత్రమే. పబ్లిసిటీకి మాత్రం ముందుంటున్నారు. ముఖ్యంగా.. శని, ఆదివారాల్లో నగర ప్రజలతో పాటు పోలీస్ వ్యవస్థ కూడా నిద్రపోతోంది. 11 అయితే బైక్ రైడర్లు రెచ్చిపోతున్నారు. కనీసం నంబర్ ప్లేట్ కూడా లేకుండా బీచ్‌రోడ్డులో మందుబాబులు రెచ్చిపోతున్నారు. ఓ వైపు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రజలు 24 గంటలు స్వేచ్ఛగా తిరిగేలా పోలీస్ వ్యవస్థ ప్రజలకు అండగా ఉంటుందని చెప్పిన దానికి.. సిటీలో జరుగుతున్న ఘటనలకు పొంతన కుదరడంలేదు.

విచ్చలవిడిగా మందు..

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో 6 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఫిషింగ్ హార్బర్ రోడ్డులో 2, టౌన్ కొత్తరోడ్డు వద్ద 3, రామకృష్ణా జంక్షన్ వద్ద ఒకటి, పాతపోస్టాఫీస్ వద్ద ఒకటి, పండావీధిలో ఒక వైన్ షాప్ ఉన్నాయి. వాటికి అసలు సమయ పాలన అనేదే ఉండడం లేదు. విచ్చలవిడిగా మందు దొరుకుతుంది. ఇదిలా ఉండగా పండావీధిలో 24 గంటలు మందు లభ్యమవుతోంది. స్పందించాల్సిన పోలీసులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా అగ్రహారం వీధి, కాదంబరివీధి, కంచరవీధి, రెల్లివీధి తదితర ప్రాంతాల్లో మందుబాబులు రెచ్చిపోతున్నారు.

కేజీహెచ్‌లో ఘటనలకు కొన్ని మచ్చుతునకలు

- జనవరి 18న ఆంధ్రా మెడికల్ కాలేజీ వుమెన్స్ హాస్టల్లో దొంగలు పడ్డారు. విలువైన నాలుగు సెల్‌ఫోన్లు.. ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయి. సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడ్డ యువతి వైద్య విద్యార్థినిగా హాస్టల్లోకి ప్రవేశించింది. ఆ సమయంలో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నట్టా? లేనట్టా?
- ఫిబ్రవరి 4న మద్యం సేవించి విధులకు హాజరవుతున్నాడన్న ఆరోపణలపై ఉద్యోగి రాజును వైద్యాధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో వైద్యులపై కోపం పెంచుకున్న రాజు గత నెల ఒకటో తేదీన ఆస్పత్రిలోని చిన్న పిల్లల వార్డుకు సరఫరా అయ్యే ఆక్సిజన్ పైపులైన్ కట్ చేసే ప్రయత్నం చేశాడు.
- ఫిబ్రవరి 26న గైనకాలజీ వార్డులో చోటు చేసుకున్న సంఘటన తీవ్ర గందరగోళానికి దారి తీసింది. ఇద్దరు తల్లులకు జన్మించిన శిశువులను వారి కుటుంబ సభ్యులకు అప్పగించడంలో సిబ్బంది చేసిన తప్పిదంతో రెండు కుటుంబాలు ఆందోళనకు దిగాయి.
- కేజీహెచ్‌లోనే నకిలీ వైద్యులు కలకలం సృష్టించారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తామన్న నకిలీ వైద్యుల బారిన పడి బాధితులు మోసపోయారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయిస్తానని శ్రీకాకుళానికి చెందిన దూసి రాంజీ నుంచి రూ.లక్ష తీసుకుని వైద్యులుగా అవతారమెత్తిన నకిలీ డాక్టర్లు నరసింహం, ప్రవీణ్ బాధితుడిని మోసగించారు.

సాక్షాత్తు ఓ డాక్టర్ ఆవేదన ఇలా..

ఓ ఆటో వాలా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దీనిపై సీపీకి ఫిర్యాదు చేస్తానన్నాను. ఇదిగో సీపీ నంబరు తీసుకో. నేను పవన్ కల్యాణ్ తాలూకా. జాగ్రత్త అంటూ బెదిరించాడు. భయపడి నేనే క్షమాపణ కోరాను. యాసిన్ బాబా గుడి సమీపంలో రాత్రి వేళల్లో మందుబాబులు రెచ్చిపోతున్నారు. స్పందించే నాథుడే కరవవుతున్నాడు అని ఆ వైద్యుడు వాపోయారు.

కొరవడిన నిఘా..

కేజీహెచ్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఉంది. పేదల ఆస్పత్రి అయిన కేజీహెచ్‌పై వన్‌టౌన్ పోలీసులు చిన్న చూపు చూస్తున్నారు. సరైన నిఘా లేక.. అనేక నేరాలకు అడ్డాగా కేజీహెచ్ తయారయింది. పిల్లల వార్డులో అత్యంత సురక్షితంగా ఉండాల్సిన ఆక్సిజన్ పైపులను కొంత మంది గంజాయి బ్యాచ్ కట్ చేయడానికి ప్రయత్నించిన ఘటన.. కిడ్నీ మార్పిడి పేరిట బాధితులను మోసం చేసిన నకిలీ డాక్టర్ల అంశం అందుకు నిదర్శనం.



పాతనగరంలోని సూర్యాబాగ్ ప్రాంతం

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

నేరాల పట్ల అప్రమత్తం



టూటౌన్ సీఐ తిరుమలరావుకు అమ్మవారి శేషవస్త్రం అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

అల్లిపురం: నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ బెండు తిరుమలరావు అన్నారు. నేరాల నియంత్రణలో ప్రజల సహకారం ఉండాలని ఆయన కోరారు. ఆదివారం సాయంత్రం కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ ఆలయం వద్ద ఆయన నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కార్యవర్గ సభ్యులు స్వాగతం పలికారు. అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయ పరిసరాలలో ఎటువంటి నేరాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా గంజాయి అమ్మినా, వినియోగించినా పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. నేరాల నియంత్రణలో పోలీసులతో సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు యల్లమాంబ అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు కర్రి నీలకంఠం, బొడ్డు పోలారావు, బొడ్డేటి ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలమాంబ జాతర ప్రారంభం



అమ్మవారిని తోడ్కొని వస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) పోలమాంబ అమ్మవారు



నెత్తిన బిందెలతో కోలాటం ఆడుతున్న మహిళలు



అమ్మవారి జలాభిషేకానికి కలశాలతో పసుపు, కుంకుమ నీళ్లు తీసుకెళ్తున్న మహిళలు

దాబాగార్డెన్స్: పాతనగరంలోని మంథా వారివీధి (రజకవీధి)లో వెలసిన పోలమాంబ జాతర (34వ పరస) మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రారంభ పూజలు, మంగళ స్నానం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పసుపు నీళ్లతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. సాయంత్రం 6 నుంచి భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలు, 7 గంటలకు పంచామృతాభిషేకాలు, సహస్ర అర్చనలు, జోగి కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు, ఉయ్యాల కార్యక్రమం జరుగుతాయి. ఉత్సవంలో భాగంగా 5న ప్రధాన పండగ, అమ్మవారి జాతర కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు ఉమా మహేశ్వర ఆలయం, పోలమాంబ అమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు దమరశింగు కనకారావు, కార్యదర్శి గుడివాడ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కరగాని శంకరరావు, ఉపాధ్యక్షుడు బొండాడ లక్ష్మీప్రసాద్, కోట్ల సాయిబాబా, కోశాధికారి పండా సత్యనారాయణ తెలిపారు. ప్రధాన పండగను పురస్కరించుకుని మంగళవారం ఉదయం 7 గంటలకు కుంకుమ పూజలు, పుష్పాలంకరణ, సాయంత్రం అగ్నిగుండం, పులివేషాలు, తప్పిటగుళ్లు, తాడేపల్లిగూడెం కళాకారులచే కాళికా శక్తి ప్రదర్శన వంటి కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక అంశాలు ఏర్పాటు చేసినట్టు సంఘం సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే వంశీ, కార్పొరేటర్ కందుల మధ్య లొల్లి

- కందుల వద్దన్న వ్యాపారిని పార్టీలో చేర్చుకున్న ఎమ్మెల్యే



కొండలరావును పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ (ఫైల్)

దాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధి 32వ వార్డులో ప్రముఖ వ్యాపారవేత్త (ఖైనీ.. గుట్కా వ్యాపారి) కొండలరావు వార్డు పరిధి తన గృహ/వ్యాపార సముదాయాల ముందు నుండి ఎవరూ వెళ్లరాదంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. స్థానికులతో తరచూ తగాదాలకు దిగుతున్నారు. ఈ విషయంపై ఇటీవల పలువురు వ్యాపారి ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. ఈ విషయం వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు దృష్టికి వెళ్లింది. కార్పొరేటర్ కూడా స్థానికుల తరపున పోరాడారు. వ్యాపారికి కార్పొరేటర్ వార్నింగ్ కూడా ఇచ్చారు. కులాల పేరిట దూషణ తగదన్నారు. ఈ పోరాటం పోలీస్ కమిషనర్ దృష్టికి చేరింది. ఈ వ్యాపారిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో స్థానికులు ఫిర్యాదు కూడా చేశారు.

వంశీ..కందుల మధ్య వ్యాపారి చిచ్చు..

వార్డు పరిధిలో ఏ కార్యక్రమం చేసినా స్థానిక కార్పొరేటర్ కందుల నాగరాజు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా నిర్వహింపజేస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యాపారి విషయంలో ఇద్దరి మధ్య పొరపొచ్చాలు మొదలయ్యాయి. వ్యాపారిపై పలు కేసులున్నాయని, స్థానికులతో సన్నిహితంగా ఉండరని చెప్పినప్పటికీ ఈ వ్యాపారిని ఎమ్మెల్యే పార్టీలో చేర్చుకోవడంలో ఆంతర్యమేంటనే మీమాంసలో ఉన్నారు. ఇదిలా ఉండగా.. పార్టీలో ఆ వ్యాపారి చేరుతున్నట్టు తెలిసి పార్టీ కార్యక్రమం కింద తాను వెళ్తే.. తాను వారిస్తున్నా తనను చెయ్యి పట్టుకుని స్టేజ్‌పైకి తీసుకెళ్లారని కార్పొరేటర్ కందుల నాగరాజు మీడియా ముందు వాపోయారు.

క్రీడల్లో కేజీహెచ్ ఉద్యోగుల ప్రతిభ



కీడల్లో రాణించిన ఉద్యోగులను అభినందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

జగదాంబ: క్రీడల్లో ప్రతిభ కనబరిచిన కేజీహెచ్ ఉద్యోగులను సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఆదివారం అభినందించారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 21 వరకు చెన్నైలో వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయని, వాటిలో కేజీహెచ్ నుంచి వాలీబాల్, 400, 800 మీటర్ల పరుగు పందెంలో వి. శాంతి, రాధారాణి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారన్నారు. జాతీయ స్థాయిలో సిబ్బంది గెలుపొందడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ, పద్మ, కల్పన, మౌళి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే మానవ జన్మకు సార్థకత

మురళీనగర్ : సామాజిక సేవ ద్వారా మన చుట్టూ ఉన్నవారికి సాయపడడంతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని సెయింట్ ఆన్స్ ఉమెన్స్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ఆకలితో అలమటిస్తున్న బాలలు ఎంతో మంది ఉన్నారని, అలాంటి వారికి ఒక్క పూట భోజనం పెట్టి ఆదుకోవాలన్నారు. పార్కులో పచ్చదనం పెంపునకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె ప్రశంసించారు. పార్కులో గ్రంథాలయం నిర్వహణ బాగుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మార్చి నెలలో నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, జాలీ వాకర్ ఎస్.మాధవి పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

సీతమ్మధార : సీతమ్మధార గురువాయురప్పన్ శ్రీకృష్ణ మందిరం వద్ద గల ఫంక్షన్ హాల్‌లో శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకులు వి.ప్రభాకర్ సారథ్యంలో శ్రీ భూ నీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళ ధ్వని, వేదమంత్రాలతో శ్రీమాన్ పాణంగిపల్లి రంగనాథ స్వామి బృందం కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. ముందుగా తిరువీధి మహోత్సవం జరిగింది. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ కల్యాణంలోని ఘట్టాలను చక్కగా వివరించారు.

మత్తు.. చిత్తు



మద్యం సేవించే వారు మత్తులో ఉండడం సహజం. మద్యం సేవించడం కాస్త ఎక్కువైతే.. పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పడానికి ఈ ఫొటో నిదర్శనం. తాగిన మైకంలో ఓ మురుగు కాలువకు ఆనుకుని ఉన్న చిన్న పాటి గట్టుపై ఓ మందుబాబు ఇలా కునుకు తీస్తున్నాడు. ఏ మాత్రం ఇటు ఒరిగితే.. కాలువలో పడి తలకు దెబ్బ తగలడం ఖాయం. ఆ మురుగు కాలువలో పడితే.. సోమవారం ఉదయం వరకు ఎవరికీ తెలియదు. ఎందుకంటే ఈ ప్రాంతం చీకటిగాను, జనసంచారం తక్కువగాను ఉంటుంది. అల్లిపురం బీఆర్ జంక్షన్ నుంచి దొండపర్తి డీఆర్ఎం కార్యాలయానికి వచ్చే మార్గంలో ఓ మందుబాబు ఇలా తాగిన మైకంలో నిద్రిస్తూ 'సాక్షి' కంటపడ్డాడు. – దాబాగార్డెన్స్

ఎట్టకేలకు అధికారుల్లో చలనం

- పందిమెట్ట జంక్షన్ వద్ద స్టాపర్ల ఏర్పాటు
- రోడ్డు ప్రమాదాల నివారణకు అవకాశం



పందిమెట్ట జంక్షన్‌లో ఏర్పాటు చేస్తున్న స్టాపర్లు

దాబాగార్డెన్స్: అధికారుల్లో ఎట్టకేలకు చలనం వచ్చింది. తరచూ ప్రమాదాలకు గురవుతున్నా.. వారిలో చలనం అంతంతమాత్రంగానే ఉండేది. గతంలో ఈ ప్రాంతంలో రెండు.. మూడు ప్రమాదాలు జరిగినా నామమాత్రపు చర్యలే తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 18న శ్రీకాకుళం నుంచి ఫిషింగ్ హార్బర్‌కు 40 టన్నుల ఇసుకతో ఓ లారీ పందిమెట్ట మీదుగా బీచ్‌రోడ్డుకు వెళ్తోంది. బీచ్‌రోడ్డులో నగర ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి వీలుగా వేకువజాము 4.30 నుంచి 7 గంటల వరకు వీఎంఆర్‌డీఏ పార్కు నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ వాహనాల నిషేధం ఉంటుంది. ఆ క్రమంలో వీఎంఆర్‌డీఏ పార్కు వద్ద రోడ్డు మూసేయడంతో ఆ లారీ డ్రైవర్ ఏయూ మీదుగా పందిమెట్ట చేరుకుని, అక్కడి నుంచి నోవాటెల్ డౌన్‌కు దిగాడు. ఆ సమయంలో లారీకి బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి బీచ్ వైపు దూసుకుపోయింది. ప్రమాదాల నివారణకు రోడ్డుపై పోలీసులు ఏర్పాటు చేసిన పెద్ద ప్లాస్టిక్ ఇసుక డబ్బాలను ఢీకొట్టింది. ఫుట్‌పాత్ మీదుగా గోడను ఢీకొట్టి అవతలి వైపు సర్వీసు రోడ్డులోకి ఎగిరి పార్కులోకి చొచ్చుకు పోయింది. ఆ సమయంలో వాహనాలు.. ప్రజల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

గతంలో ఇక్కడే రెండు ప్రమాదాలు..

గతంలో ఇదే ప్రాంతంలో రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. స్కూల్ బస్సు ప్రమాదానికి గురి కాగా.. బస్సులో పిల్లలు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. మరో ప్రమాదంలో ఓ లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో రక్షణ గోడను ఢీకొట్టి అవతలి వైపు గల సర్వీస్ రోడ్డులోకి వెళ్లింది. ఆ సమయంలో ఐపీఎస్ అధికారి తన కుటుంబంతో సహా అక్కడ సేదదీరుతున్నారు. ఈ ప్రమాదంలో అతని తండ్రి చనిపోగా, అధికారికి కాళ్లు విరిగిపోయాయి. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ పోలీసులు రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు.. పాదచారులు తరచూ మొర పెట్టుకుంటున్న సంగతి తెలిసిందే.

ఎట్టకేలకు స్పందన..

ఈ రోడ్డు (పందిమెట్ట నుంచి నోవాటెల్ బీచ్ రోడ్డుకు వెళ్లే దారి)లో తరచూ వాహనాలు బ్రేకులు ఫెయిలై ప్రమాదాలు సంభవిస్తున్నా.. అధికారులు నామమాత్రపు చర్యలే చేపట్టేవారు. ఇటీవల జరిగిన సంఘటనతో పోలీసులు మేల్కొన్నారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ రోడ్డు గుండా భారీ వాహనాలు రాకుండా చెక్ పెట్టేందుకు పంది మెట్ట జంక్షన్ వద్ద పెద్ద స్టాపర్లు ఏర్పాటు చేశారు.

ఎండ.. క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో బోసిపోయిన రోడ్లు



బోసిపోయిన రామకృష్ణా జంక్షన్‌లోని 75 ఫీట్ రోడ్డు



నిర్మానుష్యమైన రైతు మార్కెట్ రోడ్డు

దాబాగార్డెన్స్: అసలే ఆదివారం. ఆపై ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్–న్యూజీల్యాండ్ మ్యాచ్. ఇంకేముంది.. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అటు ఇటు తిరిగే వాహనాలు.. మార్కెట్ల రద్దీతో కనిపించే నగరం.. మధ్యాహ్నం నుంచి చల్లబడింది. మధ్యాహ్నానికి ఇంటికి చేరిన వారంతా టీవీ వీక్షణలో పడ్డారు. దీంతో నగరంలోని నిత్యం రద్దీగా కనిపించే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.